www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -319 మంగళవారం 24 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఎల్ అండ్ టి నుంచి మెట్రో పూర్తి స్వాధీనం

## తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు



- మెట్రో విస్తరణకు తొలగనున్న అడ్డంకులు
- స్వాధీన ప్రక్రియ పర్యవేక్షణకు భట్టి ఆధ్వర్యంలో ఉపసంఘం
- మార్చి 31లోగా మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తికి నిర్ణయం
- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్యవిధాన పరిషత్
- ఖమ్మం జిల్లాలో టిటిడి నిర్మాణాలకు 20 ఎకరాలు
- మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో జేఎన్‌టీయూకు 70 ఎకరాలు
- అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలకు భూ కేటాయింపులు
- మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**

: హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే పక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉంటారు.. ఇకపోతే మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. 30 వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 20న బడ్జెట్ ప్రవే శ పెడతారు..**మిగతాది** 2లో...

## దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

### సుప్రీం తీర్పుతో దారికొచ్చిన ప్రభుత్వం

### మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు వెల్లడి

### అమెరికా కస్టమ్స్ శాఖ ప్రకటన విడుదల



వాషింగ్టన్,**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**

దిగుమతులపై సుంకాల విధింపును మంగళవారం నుంచీ నిలిపి వేయనున్నామని అమెరికా కస్టమ్స్ శాఖ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక ఎమర్జెన్సీ పేరిట ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల తీర్పునిచ్చిన నేపథ్యంలో యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్స్ ప్రొటెక్షన్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది.**మిగతాది** 2లో...

## పలు జిల్లాల్లో వడగళ్ల వాన

### పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం -పంటలకు తీవ్రంగా నష్టంతో రైతుల ఆందోళన

హైదరాబాద్,**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం అకస్మాత్తుగా వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. **మిగతా** 2లో...



## అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

- విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ
- జిఎంఆర్,ఫిక్కీ సంస్థలతో ఒప్పందం
- ఉపాధి బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్న సీతక్క

హైదరాబాద్,**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**

అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, **మిగతాది** 2లో...



## బీహార్‌లో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అరెస్ట్

### రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసు

అమరావతి**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**

రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ,



## సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

### ఏకసభ్య కమిషన్ విచారణపై పిటిషన్ కొట్టివేత

### కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తునకు మార్గమం సుగమం

న్యూఢిల్లీ**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**

మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనాపరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం 2లో...



## జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

- జోగులాంబ గద్వాల జిల్లాలో రైతు సంఘర్షణ సభలో పాల్గొన్న కవిత
- భవిష్యత్తులో జోగులాంబ జిల్లా నుంచే కార్యక్రమాలు చేపడతామని హామీ
- నడిగడ్డను బీఆర్ఎస్ మోసం చేసిందన్న కవిత



2లో.

## తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం

### పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం

### పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడి

### ఈ నెల 26 నుంచి 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం

### జిల్లాలు, లోక్ సభ సభ్యుల వారీగా ఇన్‌ఛార్జుల నియామకం

**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన తెలంగాణ విభాగం ప్రకటన విడుదల చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. జనసేన పార్టీ 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించాలని **మిగతా** 2లో...




## రాజమండ్రిలో పాలకల్తీతో కిడ్నీ ఫెయిల్యూర్

### ఇప్పటికే నలుగురు మృతి..మరో నలుగురి పరిస్థితి విషమం

### పాలవ్యాపారి గణేశ్ అరెస్ట్.. పరీక్షలకు పాల నమూనాలు

రాజమహేంద్రవరం**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**

రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. చికిత్స పొందుతూ లాలాచెరువు చౌడేశ్వరినగర్‌కు చెందిన ఎన్.శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) సోమవారం ఉదయం చనిపోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా పాలు కల్తీ కావడంతో **మిగతాది** 2లో...



## నా పేరుతో ఎలాంటి సంస్థలు లేవు: కెటిఆర్



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

(మొదటి పేజీ తరువాయి

ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. అమెరికా కాలమానం ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి 12.01 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది.సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన మూడు రోజులకు కస్టమ్స్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. వెంటనే సుంకాల వసూలును ఎందుకు నిలిపివేయలేదో చెప్పలేదు. ఇప్పటివరకూ వసూలు చేసిన సుంకాల డబ్బును రీఫండ్ చేయడంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై కొత్తగా 10 శాతం కనీస సుంకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దాన్ని 15 శాతానికి పెంచారు. ఐఈఈపీఏ చట్టానికి బదులు వాణిజ్య చట్టం-1974లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ సుంకాలకు తెరతీశారు. అయితే, అమెరికా చట్టసభల అనుమతి లేనిదే వీటిని కూడా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేదు. ఇక జాతీయ భద్రత పేరిట స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్స్, ఆటో రంగాలపై గతంలో విధించిన సుంకాలనూ ట్రంప్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన సుంకాలు విధించేందుకు మార్గాలను అన్వేషించాలని వాణిజ్య విభాగానికి ఆయన సూచించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇకపోతే సుంకాల విధింపు చెల్లదంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు మొదలయ్యాయి. సుంకాల వల్ల ఇప్పటివరకూ అధిక ధరలు చెల్లించిన అమెరికన్ కస్టమర్లు తమకు రీఫండ్స్ కావాలని పట్టుబడుతున్నారు. ఈ జాబితాలో ట్రంప్ రాజకీయ ప్రత్యర్థులతో పాటు కార్పొరేట్ కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే, ఈ ప్రక్రియ అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు.తాను విధించిన సుంకాల భారం విదేశీ ఎగుమతిదారులపై తప్ప సామాన్య అమెరికన్లు, అమెరికా దిగుమతి దారులపై లేదని ట్రంప్ ఇప్పటివరకూ చెబుతూ వచ్చారు. అయితే, ఆయన రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఈ వాదనతో మొదటి నుంచీ విభేదిస్తున్నారు. అధిక సుంకాల భారాన్ని సామాన్య అమెరికన్లే భరించాల్సి వచ్చిందని మండిపడేవారు. ఇక సుప్రీం తీర్పు తరువాత ఇల్లినాయ్ రాష్ట్ర గవర్నర్ సుంకాల రీఫండ్స్ కోరుతూ ట్రంప్‌నకు బిల్లులు పంపించారు. సుంకాల కారణంగా తమ రాష్ట్రం 9 బిలియన్ డాలర్లు అధికంగా చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. తమ రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై సగటున 1,700 డాలర్ల అదనపు భారం పడిందని అన్నారు. ఇక కార్పొరేట్ కంపెనీలు కూడా రీఫండ్స్‌కు సిద్ధమవుతున్నాయి. కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి పలు సంస్థలు ఇప్పటికే కేసులు దాఖలు చేశాయి. ఇప్పటివరకూ ట్రంప్ ప్రభుత్వం సుంకాల పేరిట 133 బిలియన్‌ల నుంచి 175 బిలియన్ డాలర్ల మేర వసూలు చేసి ఉంటుందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. సుంకాల డబ్బులో ఎంతో కొంత తిరిగిస్తామని ట్రంప్ వర్గం ఇప్పటికే పలుమార్లు తెలిపింది. అయితే, ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. సామాన్య ప్రజలకు నేరుగా రీఫండ్స్ అందే అవకాశాలు తక్కువని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కూడా పేర్కొన్నారు. రీఫండ్స్‌లో అధికభాగం దిగుమతిదారులు, అమెరికన్ కంపెనీలకే వెళుతుందని చెబుతున్నారు. విదేశీ ఉత్పత్తుల దిగుమతి సమయంలో వీరే కస్టమ్స్ శాఖకు నేరుగా సుంకాల రూపంలో అధిక ధరలను చెల్లించారని వివరిస్తున్నారు. రీఫండ్స్ ప్రక్రియ కూడా సంక్లిష్టంగా ఉంటుందని ఇప్పటికే జస్టిస్ ఏమీ కోనీ బేరెట్, జస్టిస్ బ్రెట్ కేవనా హెచ్చరించారు. ఈ విషయంలో కోర్టు కేసులు కొలిక్కి వచ్చేసరికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని ట్రంప్ కూడా ఇటీవల ఓ సందర్భంలో స్వయంగా అంగీకరించారు. వేల కొద్దీ దిగుమతిదారుల రిఫండ్స్ అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకూ భారంగా మారుతుందని అంటున్నారు. ఇక అంతర్జాతీయ స్థాయిలో కూడా ట్రంప్ సర్కారు పలు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్, కీల్ ఇన్‌స్టిట్యూ?ట్ అంచనా ప్రకారం, కస్టమ్స్ శాఖ వసూలు చేసిన సుంకాల్లో 90 నుంచి 96 శాతం అమెరికన్ల జేబుల్లోంచే వెళ్లాయి. భారత్, చైనా, మెక్సికో లాంటి దేశాలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపు రూపంలో 4-10 శాతం మాత్రమే సుంకాల భారాన్ని భరించాయి.

# పలు జిల్లాల్లో వడగళ్ల వాన

(మొదటి పేజీ తరువాయి

భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయ మయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. రైతులకు నష్టం జరిగిన ప్రాంతాల్లో నివేదికలు సేకరిస్తున్నారు.

# ఎల్ అండ్ టి నుంచి మెట్రో పూర్తి స్వాధీనం

దీనికి కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇకపోతే మెట్రోకు సంబంధించ గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్అండ్‌టీకి చెల్లించేలా.. రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన ప్రక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్సీ మదింపు చేసి ప్రాథమిక నివేదికలిచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ.15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ.13,000 కోట్లు కాగా, ఎల్ అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ.2,000 కోట్లుగా ఉంది. మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది. ఇకపోతే ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు గా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ది చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరు లో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం , రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి. స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన ప్రక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జన గణన ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం కీలక ఆమోదం తెలిపింది. ఈ భారీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన తొలి విడత ఇండ్ల గణన అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణరావు ఈ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కేబినెట్‌కు వివరిస్తూ, మే 11వ తేదీన ఈ గణనను ప్రారంభించి జూన్ 9వ తేదీ వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశిరచిన 34 ప్రశ్నలతో కూడిన నమూనా పత్రాన్ని ప్రభుత్వం వినియోగించనుంది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించేందుకు సుమారు 84 వేల మంది ఎన్యుమ రేటర్లను, వారికి దిశానిర్దేశర చేసేందుకు నోడల్ ఆఫీసర్లను కలిపి మొత్తం 89 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఈ విధుల్లో భాగస్వాములను చేయనున్నారు. తొలి దశ విజయవంతంగా ముగిసిన తర్వాత, అసలైన రెండో దశ జన గణన ప్రక్రియను వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అంచనాకు ఈ గణన ఎంతో కీలకం కానున్న నేపథ్యంలో, ఎలాంటి లోపాలు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జనగణన ప్రక్రియలో పాలుపంచుకుంటారని తెలిపారు.

# సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్,కమిటీని ఏర్పాటుచేయాలని ఈ నెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటుచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. సోమవారం సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను కొట్టివేసింది.తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. శ్రీవారి లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది. దీంతో కమిషన్ ఏర్పాటును సుప్రీం సమర్థించింది.

## అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

(మొదటి పేజీ తరువాయి

గ్రౌండ్ హ్యాడ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించ నున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండస్ట్రీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ఫ్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జీ యునివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జీ యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని, భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహాగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం-పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## బీహార్‌లో ఐపీఎస్ అధికారిసునీల్ నాయక్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి

ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో వేధించినట్లు నమోదైన 'థర్డ్ డిగ్రీ' కేసులో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ను బీహార్‌లో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ కేడర్‌కు చెందిన సునీల్ నాయక్.. వైసీపీ హయాంలో డిప్యూటేషన్‌పై సీఐడీలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన బీహార్ వెళ్లిపోయారు. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ పాత్రపై ఫిర్యాదు చేయడంతో విచారణకు రావాలని ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు బిహార్‌లోని పట్నాలో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బిహార్ రాష్ట్రంలో ఐజీగా విధులు నిర్వహిస్తున్న సునీల్ నాయక్‌ను పట్టుకునేందుకు ఏపీ పోలీసుల బృందం పట్నా వెళ్ళింది. గత కొంతకాలంగా ఈ కేసులో విచారణకు హాజరుకావాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆయన స్పందించకపోవడంతో పోలీసులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సునీల్ నాయక్ ఏపీ సీఐడీలో ఐజీగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. 2021లో రాజద్రోహం కేసులో తనను అరెస్టు చేసిన సమయంలో, సీఐడీ కస్టడీలో ఉండగా తనపై సునీల్ నాయక్ నేతృత్వంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. తన కాళ్లపై తీవ్రంగా కొట్టడం, మానసికంగా వేధించడం వంటి చర్యల్లో సునీల్ నాయక్ కీలక పాత్ర పోషించారని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సునీల్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్న వెంటనే ఏపీ పోలీసులు బిహార్ ప్రభుత్వానికి అధికారికంగా సమాచారం అందించారు. పట్నాలోని స్థానిక కోర్టులో ఆయనను హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ కోరారు. కోర్టు అనుమతి లభించడంతో ఇవాళ రాత్రికి ఆయనను విమానంలో లేదా రోడ్డు మార్గంలో గుంటూరుకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈ అరెస్టుతో ఏపీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత ప్రభుత్వ హయాంలో అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందనే సంకేతాలు ఈ ఘటనతో స్పష్టమవుతున్నాయి. ఈ కేసులో మరికొందరు ఉన్నతాధికారులు కూడా విచారణను ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

## తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం

(మొదటి పేజీ తరువాయి

పవన్ కల్యాణ్ నిర్ణయించారు.ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్టీని 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జిల్లాలవారీగా కొంతమంది నాయకులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్‌లకు వేర్వేరు ఇన్‌ఛార్జులను నియమించారు.జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు రాధారాం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరి రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆ ప్రకటనలో జనసేన పార్టీ తెలిపింది. ఆయా పార్లమెంట్ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాల బాధ్యతను రసువుకు నాయకులకు అప్పగించారు.

## రాజమండ్రిలో పాలకల్తీతో కిడ్నీ ఫెయిల్యూర్

(మొదటి పేజీ తరువాయి

మరణించారని తెలుస్తోంది. దీంతో పాలు పోసే వ్యక్తి గాణెళిశ్‌ను అరెస్ట్ చేశారు. పాలను పరీక్షలకు పంపారు. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో ఒక్కొక్కరుగా 14 మంది ఆసుపత్రిలో చేరారు. వీరిలో భాగిశెట్టి కనకరత్నం (76), తాడి కృష్ణవేణి (75) ఇప్పటికే మృతిచెందారు. బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడినవారే కాగా 5 నెలల శిశువు, మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు ఆదివారం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రుల పాలైన బాధితులందరికీ ఒకే వ్యక్తి పాలు పోస్తుండటంతో అక్కడే కల్తీ జరిగి ఉండొచ్చని వైద్యాధికారులు, బాధితులు పోలీసులకు తెలిపారు. శివరాత్రి రోజు పాలు, పెరుగు చేదుగా అనిపించాయని కొంతమంది బాధితులు చెప్పారు. కోరుకొండ మండలానికి చెందిన గణెళిష్ అనే వ్యాపారి వీరందరికీ పాలు పోస్తున్నట్లు గుర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. బాధితుల నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను టాక్సికాలజీ పరీక్షకు పంపించారు. ఆ నమూనాల నివేదికలు రావాల్సి ఉంది.

## నా పేరుతో ఎలాంటి సంస్థలు లేవు: కెటిఆర్

**హైదరాబాద్,ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,:** తన పేరుతో ఎలాంటి సంస్థలు లేవని, అలా సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. కొంతమంది 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' లాంటి పేర్లతో సంస్థలను ఏర్పాటు చేసి కార్యకలాపాలు చేపడుతున్నట్లు తెలిసిన నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు. 'నా పేరుతో ఎలాంటి సంస్థలకు అనుమతి లేదు. అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోం' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎవరైనా సేవా దృక్పథంతో పనిచేయాలనుకుంటే కచ్చితంగా భారత రాష్ట్ర సమితి పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

## జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**

బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు.

కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు.జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు.సమాధానం చెప్పకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు.నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
మంగళవారం 24 ఫిబ్రవరి 2026

# భవన అనుమతులు ఒకలా నిర్మాణాలు మరోలాగా..



**కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారి తుల్జా సింగ్ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్..**
**ప్రభుత్వానికి భారీ నష్టం..**
**సొంత ఆస్తులు పెంచుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**
**ప్రైవేటు సిబ్బంది ని ఏర్పాటు చేసుకొని వసూళ్లకు పాల్పడుతున్న సెక్షన్ ఆఫీసర్..**
**దరఖాస్తు చేసుకున్న ప్రతి ఫైల్ కు ప్రైవేటు సిబ్బందిచే వసూళ్లు..**
**కాప్రా టౌన్ ప్లానింగ్ విభాగంలో సమాచార హక్కు చట్టం పనిచేయదా..?**






**ప్రజావినికిడి,(కాప్రా):**కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వానికి నష్టం వాటిల్లేల టౌన్ ప్లానింగ్ అధికారి తుల్జాసింగ్ వ్యవహారంపై దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారంపై దరఖాస్తుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని,ప్రతి దరఖాస్తుకు డబ్బులు ఇస్తేనే పనులు జరుగుతున్నాయని లేకుంటే దరఖాస్తు తిరస్కరణ జరుగుతుందని వివిధ రకాల అభ్యంతరాలు పెడుతూ దరఖాస్తును మామూళ్ల కోసం తిరస్కరిస్తున్నాడని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమ భవన నిర్మాణాలు భారీగా చేస్తున్నారని వాటికి టౌన్ ప్లానింగ్ అధికారులు మామూళ్లు తీసుకుంటూ సహకరిస్తున్నారని అనడానికి ఈ అక్రమ నిర్మాణాలే నిదర్శనం అని స్థానికులు వాపోతున్నారు. జిహెచ్ఎంసిలో ప్రజల నుండి లక్షలాది రూపాయలు పన్నుల రూపేనా వసూలు చేసి ప్రభుత్వ అధికారులకు జీతాలు ఇస్తుంటే ప్రభుత్వానికి రావాల్సిన డబ్బులు రాకుండా తమ సొంత ఆస్తులు పెంచుకుంటున్నారని వాటిపై విజిలెన్స్,ఏసీబీ ఎంక్వయిరీ చేసి ఆస్తుల వివరాలు బట్టబయలు చేసినట్లయితే అక్రమ ఆస్తుల వివరాలు బయటకు వస్తాయని స్థానిక ప్రజలు విజిలెన్స్ అధికారులను కోరుతున్నారు. ప్రభుత్వానికి నష్టం వచ్చేలా వ్యవహారం చేస్తున్న అధికారులపై కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటారా లేకుంటే గాలికి వదిలేసారా అన్న విషయానికి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారి తుల్జా సింగ్ గతంలో మల్కాజిగిరి ఉప్పల్ సర్కిల్లో పనిచేసే వారని అనంతరం కాప్రా సర్కిల్ ఇన్చార్జిగా ఇచ్చారని కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై వస్తున్న మామూలను చూసి ఉన్నత అధికారులకు లంచాలు ఇచ్చి శాశ్వతంగా కాప్రా సర్కిల్ కార్యాలయానికి ఉద్యోగాన్ని బదిలీ చేసుకొని పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలకు సహకరిస్తూ పెద్ద మొత్తంలో ముడుపులు దండుకుంటున్నారని టౌన్ ప్లానింగ్ దరఖాస్తుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలో రైల్వే స్టేషన్ ముందు రెండుసార్లు ఫీజు చేసిన అక్రమ నిర్మాణం వద్ద భాదాపు లక్షలలో వసూలు చేసి తిరిగి నిర్మాణ పనులు చేయించడం వెనక తుల్జాసింగ్ హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన కనుసైగల్లోనే రెండుసార్లు సీజ్ చేసిన భవనం తిరిగి ప్రారంభానికి సిద్ధమవుతుందంటే ఈ అధికారి ఎంత భారీ స్థాయిలో లంచాలు తీసుకున్నారో ఏసీబీ అధికారులచే విచారణ చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఉప్పల్ సర్కిల్ తో పాటు ప్రస్తుతం కాప్రా సర్కిల్లో ప్రైవేటు సిబ్బందిని పెట్టుకొని సైట్ విజిట్ చేసి దేనికి ఎంత వసూలు చేయాలో నిర్ధారణ చేసుకుంటూ జిహెచ్ఎంసి కి సంబంధం లేకుండా ఉన్నటువంటి సిబ్బందితో పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటూ ప్రభుత్వానికి నష్టం చేస్తూ అధికార దుర్వినియోగం చేస్తున్నాడని టౌన్ ప్లానింగ్ దరఖాస్తు దారులు కాప్రా సర్కిల్ కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులు, సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న ఎలాంటి ఫలితం లేదంటూ, ఇలాంటి అధికారులపై జోనల్ కమిషనర్, ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వానికి నష్టం వాటిల్లకుండా చూడాలని దరఖాస్తుదారులు ఉన్నతాధికారులను కోరారు.

# పార్టీల పంచాయితీలకు జర్నలిస్టులను బలి చేస్తారా..?

**అక్రిడియేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగాలి..**
**టీడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, సీనియర్ జర్నలిస్ట్ కేపి..**
**కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిన షాద్ నగర్ జర్నలిస్టులు..**
**జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున హాజరైన జర్నలిస్టులు..**
**డిఆర్ఓ సంగీతకు వినతి పత్రం అందజేసిన జర్నలిస్టులు..**
**జీవో సవరణ అయ్యేంతవరకు జిల్లా అక్రిడియేషన్ కమిటీ వేయొద్దని**
**డిపిఆర్ఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ..**
**జర్నలిస్టులకు సంఘీభావం తెలిపిన సిపిఐ నేత పానుగంటి పర్వతాలు..**














**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
రాష్ట్రంలో అధికార,ప్రతిపక్ష పార్టీల మధ్య పంచాయతీలకు జర్నలిస్టులను బలి చేయొద్దు.. అక్రిడియేషన్ కార్డుల ప్రక్రియను నిరంతరం చేపట్టాలి.. గుర్తింపు లేని జర్నలిజం ఎందుకు..? ఎవరిని ఇబ్బంది పెట్టేందుకు ఈ నిర్ణయం..అంటూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి. ఖాజాపాషా (కేపి) ప్రశ్నించారు. అక్రిడియేషన్ కార్డులలో కోత విధించడంపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు శేరీబాయి గణేష్, సైదులు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘు,కౌన్సిల్ సభ్యులు,సురేష్ ఎండి ఖాజా పాషా, జిల్లా నాయకులు సుదర్శన్,ఎలికట్ట శ్రీశైలం తదితరులు హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుండి జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఉన్న ఒక్క గుర్తింపు కార్డును తొలగిస్తే ఇక వారికి ప్రయోజనం ఏముంటుందని? ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో అర్హత లేని వారికి కార్డులు ఇవ్వమంటూ ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు అర్హత ఉన్న వారిని సైతం పక్కన పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయం కారణంగా 20 నుంచి 30 సంవత్సరాల పాటు పనిచేస్తున్న పాత్రికేయులు కూడా గందరగోళంలో పడ్డారని,తీవ్ర నిరాశకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే దీనిపై స్పందించి అర్హత ఉన్నవారికి అందజేయాలని కోరారు.లేదంటే ఊరుకునేది లేదని ఆందోళన మరింత పెద్దది అవుతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య ఉన్న ప్రచండ యుద్ధాన్ని జర్నలిస్టులపై ప్రయోగించోదని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న జర్నలిస్టులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. వారందరికీ న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ సమస్యపై వెంటనే స్పందించకుంటే ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ జీవోలు సవరించాలని లేదా రద్దు చేయాలని పాత విధానం ప్రకారమే అక్రీడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి డిఆర్ఓ సంగీతకు వినతిపత్రాన్ని అందజేశారు.

అనంతరం జిల్లా నాయకులతోపాటు డిపిఆర్ఓ ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. అదేవిధంగా అక్రిడియేషన్ జిల్లా కమిటీ ఏర్పాటుకు ముందే ప్రభుత్వ నిబంధనలు సవరణ జరగాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర నాయకులు పనుగంటి పర్వతాలు తదితరులు పెద్ద ఎత్తున జర్నలిస్టులకు సంఘీభావం తెలియజేస్తూ అక్రిడేషన్ కార్డులను వెంటనే రాతగల జర్నలిస్టులకు మంజూరు చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామని తెలిపారు.

## భారీగా తరలిన జర్నలిస్టులు..

అక్రెడియేషన్ కార్డులపై ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనకు షాద్ నగర్ మంచి భారీ ఎత్తున జర్నలిస్టులు తరలారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు జర్నలిస్ట్ కేపీ,టి డబ్ల్యూ జె ఎఫ్ అధ్యక్షులు రాఘవేంద్ర గౌడ్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాహనాలలో ఆందోళన కార్యక్రమానికి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తరలి వెళ్లారు.షాద్ నగర్ జర్నలిస్టులు లక్కాకుల రమేష్ కుమార్,ఎలికట్ట శ్రీశైలం,రంగనాథ్, బూర్గుల రమేష్, మల్చలం రమేష్, నరసింహారెడ్డి, ప్రజా వినికిడి అశోక్,రాకేష్, సాయినాథ్ రెడ్డి, జగన్,రవితేజ, రాకేష్,దర్శనం శంకర్,జగన్, ధరంపాల్ సింగ్, షకీల్,రియాజ్, ఆవుల రమేష్, సిటీ కేబుల్ శివ, సికె న్యూస్ శేఖర్, కేశంపేట విలేకరులు నరేందర్,భాస్కర్, రాజశేఖర్, నరేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.









# వదల బొమ్మాళి..!

**బూర్గుల ఆరోగ్య కేంద్రాన్ని వదలని డాక్టర్**

**బదిలీ జరిగి మూడు వారాలు గడుస్తున్నా బేఖాతార్**

**బదిలీ ఆర్డర్లు తీసుకోకుండా డ్యూటీ నిర్వహిస్తున్న డాక్టర్**

**పట్టించుకోని వైద్య ఉన్నతాధికారి**

**బూర్గుల ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రం వివాదంలో ముగ్గురుకు బదిలీ**

**ఇద్దరు సిబ్బంది రిలీవ్-డాక్టర్ మాత్రం డోంట్ కేర్**

**సాక్షాత్తు డిఎంఅండ్ హెచ్ఓ ఉత్తర్వుల బేకాతర్..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
వదల బొమ్మాళి నిన్ను వదల అన్న అరుంధతి సినిమా డైలాగ్ ఈ ఆసుపత్రికి వర్తిస్తుందేమో..!? రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ ఫరూక్ నగర్ మండలం బూర్గుల ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో డాక్టర్, సిబ్బంది మధ్య చేలరేగిన వివాదం అందరికీ తెలిసిందే.ఈ వివాదం నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి లలితాదేవి ఒక విచారణ బృందాన్ని నియమించి తదుపరి నివేదిక ఆధారంగా ముగ్గురిపై బదిలీ వేటు వేశారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాఘవేందర్, అదేవిధంగా సూపర్వైజర్ అమృత,రెండవ ఏఎన్ఎం శ్రీలతలను స్థానచరణం కల్పిస్తూ ఫిబ్రవరి 5వ తేదీన రంగారెడ్డి జిల్లా వైద్యశాఖ అధికారిని లలితా దేవి ఉత్తర్వులు జారీ చేశారు.అయితే సూపర్వైజర్ అమృత అదేవిధంగా రెండవ ఏఎన్ఎం శ్రీలత ఇరువురికి బదిలీ ఉత్తర్వులు అందగానే వారు నిబంధనల ప్రకారం రిలీవ్ అయ్యారు. వారికి బదిలీ జరిగిన చోట వెళ్లి రిపోర్ట్ చేశారు. అయితే డాక్టర్ రాఘవేందర్ మాత్రం సెలవులో వెళ్తున్నట్లు సిబ్బందికి చెప్పి వెళ్లిపోయాడు. మళ్లీ మూడు రోజుల తర్వాత వచ్చి సెలవు లేదు ఏమి లేదు అని రిజిస్టర్లో సెలవుల స్థానంలో కూడా సంతకాలు పెట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం బదిలీ ఉత్తరువు ఆర్డర్ తీసుకోకుండా కాలయాపన చేస్తూ తనకేమి పట్టనట్టుగా ఉన్నతాధికారుల ఆర్డర్ బేఖాతర్ చేశారు. వాస్తవానికి ఈ అంశం కలెక్టర్ దృష్టిలో కూడా పెట్టారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య అధికారిని ఈ బదిలీ చేశారు. అయితే బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వదిలిపెట్టె ప్రసక్తే లేదని డాక్టర్ రాఘవేందర్ తన సిబ్బంది ముందు చెబుతున్నట్లు సమాచారం.వదల బొమ్మాలి వదల అన్న చందంగా ఈ డాక్టర్ వ్యవహారం తయారవడంతో స్థానికంగా ఉన్న షాద్ నగర్ పైఅధికారులు కూడా ఏం చేయాలో తెలియక తల పట్టుకుంటున్నట్టు తెలిసింది. ఆసుపత్రిలో మహిళా సిబ్బందిపై దురుసుతనంగా వ్యవహరించడం వేధింపులకు దిగడం సిబ్బంది కొంతమంది తమకు జరిగిన వేధింపుల విషయం గోప్యంగా అధికారుల ముందుకు తీసుకువచ్చారు. అయినప్పటికీ బాధితులను బదిలీ చేసి బయటికి పంపించారు. డాక్టర్ మాత్రం సీటు వదిలి కదలను అంటున్నాడు.ఈ విషయమై డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మిని మీడియా వివరణ కోరగా కనుక్కొని తర్వాత వివరణ చెబుతానని చెప్పారు. ఇప్పటివరకు మీడియాకు ఆమె వివరణ ఇవ్వకపోవడం గమనర్హం. ఎందుకు ఈ డాక్టర్ కు ఇంత వెసులుబాటు స్వేచ్ఛ కల్పించారో ఉన్నతాధికారులకే తెలియాలి అని వైద్య ఆరోగ్యశాఖలో విమర్శలు గుప్పు మంటున్నాయి..

# అధిక వేగం.. అనర్ధాలకు మూలం..

**వేగం కన్న ప్రాణం మిన్న...జాగ్రత్తగా వాహనాలు నడపాలి. -కంటి చూపు వాహనదారులకు ప్రధానం..**

**డ్రైవర్లకు ఉచితంగా కంటి చూపు పై ప్రత్యేక శిబిరం ఏర్పాటు..**

**హాజరైన ట్రాఫిక్ డీసీపీ.శివమ్ ఉపాధ్యాయ ఐపిఎస్,మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్..**

**పాల్గొన్న షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ,సీఐ విజయ్ కుమార్,ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్..**






**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడపాలంటే ముందుగా మెరుగైన కంటి చూపు చాలా ముఖ్యమని, అందుకోసం ప్రతి ఒక్క డ్రైవర్లు చెకప్ లు చేయించుకోవాలని సూచించారు. ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శివమ్ ఉపాధ్యాయ ఐపీఎస్..రోడ్డు భద్రత అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్,అభయ్ సారథి కార్యక్రమాన్ని షాద్ నగర్ ట్రాఫిక్ పోలీస్,లా అండ్ ఆర్డర్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శివమ్ ఉపాధ్యాయ ఐపీఎస్, మహేశ్వరం ట్రాఫిక్ ఏసిపి చంద్రశేఖర్, షాద్ నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ లక్ష్మీనారాయణ ఐపిఎస్,ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్,పట్టణ సీఐ విజయ్ కుమార్ హాజరయ్యారు.ఇందులో భాగంగా ముందుగా 142 మంది డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు.అనంతరం వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శివమ్ ఉపాధ్యాయ మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది ఒక క్లిష్టమైన సమస్య.ఇది రోజు వారి జీవితాలను ప్రభావితం చేస్తుందని,దీనిని పరిష్కరించడానికి అవగాహనను వ్యాప్తి చేయడానికి మరియు సురక్షితమైన పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం జాతీయ రహదారి భద్రత కార్యక్రమాలతో పాటు ప్రతి ఒక్కరు సురక్షితంగా వాహనాలు నడిపి క్షేమంగా గమ్యానికి చేరేలా ప్రతి ఒక్క పోలీసులు అటు వాహనదారులకు ఇటు డ్రైవర్లకు,ప్రజలకు అవగాహనా చేస్తూ కృషి చేస్తున్నారని అన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ అతిపెద్ద నేరం..

డ్రంక్ అండ్ డ్రైవ్ అనేది చాలా అతిపెద్ద నేరమని, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల మీతో పాటు అటు ప్రయాణికులకు ఇటు కుటుంబాలకు తీరని అన్యాయం చేసినట్లు అవుతుందని కాబట్టి ప్రతి ఒక్కరు వాహనదారులు డ్రైవర్ మద్యం పూర్తిగా మానేసి సురక్షితంగా వాహనాలు నడిపి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు.నేడు మద్యం అనేది ఒక మహమ్మారిలా ప్రతి ఒక్కరిని ఆవహించి ఉందని తద్వారా మత్తులో ఎలా నడిపిస్తామో ఏం చేస్తున్నామో తెలుసుకోకపోవడం వల్ల ఎన్నో ప్రమాదాలు,మరణాలు, సంఘటనలు,దుర్ఘటన జరుగుతున్నాయని గుర్తు చేశారు.రహదారి భద్రత నిబంధనలను వారికి వివరించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని,సిగ్నల జంపింగ్,అతివేగంతో వాహనాలు నడపరాదని సూచించారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని అన్నారు.అనంతరం నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతామని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు.ఓవర్ స్పీడ్,డ్రంక్ అండ్ డ్రైవ్,డిస్ట్రాక్టెడ్ డ్రైవ్,పని ఒత్తిడి వల్ల నిద్రపోతూ డ్రైవింగ్ చేయడం,ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం,ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, డేంజరస్ డ్రైవింగ్ వీటి వల్ల జరిగే ప్రమాదాలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో టోల్గేట్ ఇంచార్జ ఎస్డి.ఇబ్రహీం,ట్రాఫిక్ పోలీసులు,రాయికల్ వాస్తవ్యులు శ్రీనివాస్, రామేశ్వరం వాస్తవ్యులు సురేష్,అన్నారం వాస్తవ్యులు రామకృష్ణ పాల్గొన్నారు.

# ప్యాట అశోక్ వార్డు అభివృద్ధి నా బాధ్యత

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్న బిజెపి కౌన్సిలర్ అశోక్..**

**సుమారు 7 కోట్ల నిధులతో వార్డులో అభివృద్ధి..**

**ఎవరేమనుకున్నా పార్టీలకు అతీతంగానే ఉంటా..**

**ఎమ్మెల్యేను కలుసుకున్న బిజెపి నాయకులు..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయడమే నా ఉద్దేశమని, కొందరు తన లక్ష్యం తెలియక పిచ్చి మాటలు మాట్లాడుతుంటారని అలాంటి వారిని పట్టించుకోబోనని ఎవరితో ఎప్పుడూ ఇలా ఉండాలో తనకు తెలుసని ఈ నేపద్యంలో 9వ వార్డు బిజెపి కౌన్సిలర్ ప్యాట అశోక్ కు అండగా నిలిచి దాదాపు ఏడుకోట్ల రూపాయల అభివృద్ధి పనులను వార్డులో చేపడతామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిజెపి 9వ వార్డు కౌన్సిలర్ ప్యాట అశోక్ ప్రత్యేకంగా కలుసుకున్నారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ అగనూరు బసవేశ్వర్, అదేవిధంగా మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి తదితరులను శాలువాలతో సన్మానించారు. కౌన్సిలర్ అశోక్ వెంట బిజెపి నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి తదితర నాయకులు ఉన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడారు. బిజెపి కౌన్సిలర్ రాజకీయాల్లో కచ్చితంగా వచ్చి వార్డు అభివృద్ధి కోసం తనను కలిశారని తాను కూడా స్పందించానని 9వ వార్డులో సుమారు 7 కోట్ల రూపాయల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఈ పనులను జాగ్రత్తగా చేసుకోవాలని అశోక్ కు సూచించినట్లు ఎమ్మెల్యే మీడియాకు తెలిపారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని ఆ తర్వాత కలిసి అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని అన్నారు.తన నియోజకవర్గంలో మీడియాకు స్వేచ్ఛ కల్పించానని కొందరు తమ ఇష్టానుసారంగా వార్తలు రాసుకుంటున్నారని అది వారి విచక్షణకే వదిలేశానని ఎమ్మెల్యే అన్నారు. కొందరు మున్సిపాలిటీలో చెత్తగా ఓడిపోతుందని రాశారని మరికొందరు ప్రోటోకాల్ పేరిట తప్పుడు రాతలు రాస్తున్నారని అయినా వీటిని పట్టించుకోబోనని సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు తెలుస్తాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.తను మీడియాను



గౌరవిస్తానని కానీ తప్పులు రాస్తే ప్రజలు, కార్యకర్తలు క్షమించాలని ఎమ్మెల్యే సున్నితంగా హెచ్చరించారు. ఎవరేమనుకున్నా తను అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగానే ఉంటానని ఇతర పార్టీ నాయకులు నిరంతరంగా వచ్చి అభివృద్ధి విషయంలో తనతో చర్చించవచ్చు అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# ప్రజావాణికి (43) ఫిర్యాదులు





**ప్రజావినికిడి,(రంగారెడ్డి):**
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (43) ఫిర్యాదులు అందాయి.ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతి పత్రాలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాస్ జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని, వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమము కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా ప్రతి ఒక్కరు పని చేయాలని, ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చాలని తెలిపారు. ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చొరవ చూపాలని అన్నారు.రెవెన్యూ శాఖ-22,ఇతర శాఖలు 21,మొత్తం 43 దరఖస్తులు అందాయి.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించిన, ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు.. డి.ఆర్.ఓ శ్రీమతి సంగీత..




**ప్రజావినికిడి,(రంగారెడ్డి):**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లాలోని మహిళా ఉద్యోగులకు మార్చి నెల 4 వ తేదీన హెల్త్ క్యాంప్ ని ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఆటలు,క్రీడలు అదేవిదంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి మహిళలకు ప్రత్యేక అనుమతి ఇప్పించాలని అలాగే మార్చి 7వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడానికి అనుమతి నివ్వాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ను డిఆర్ఓ ద్వారా వినతి పత్రాన్ని సమర్పించారని రంగారెడ్డి జిల్లా టిజీఓ అధ్యక్షులు డాక్టర్ కే. రామారావు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీమతి శాంతి శ్రీ, శ్రీమతి రేవతి, శ్రీమతి అలివేలు, శ్రీమతి మహేశ్వరి, శ్రీమతి సైదమ్మ, శ్రీమతి జోత్స్న శ్రీమతి బాలేశ్వరి, డా.నరేందర్, మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర చికెన్ సెంటర్ యూనియన్ మీటింగ్ లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**తెలంగాణ రాష్ట్ర చికెన్ సెంటర్ అసోసియేషన్ ఎల్బీనగర్ జోన్ యూనియన్ మీటింగ్ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. తెలంగాణ స్టేట్లో ఉన్న పౌల్ట్రీ కంపెనీస్ తెలియజేయునది ఏమనగా వారి అసోసియేషన్ కు కొన్ని నిబంధనలు ఉన్నాయి వాటిని తెలియజేశారు.నిబంధన ఏరియాలో కానీ చికెన్ షాప్ కు చికెన్ షాప్ కు మధ్య దూరం 350 మీటర్లు దూరం ఉండాలని డిమాండ్ చేశారు.అలాగే కంపెనీ అవుట్లెట్లు పెట్టకూడదు అని కంపెనీలకు డిమాండ్ చేశారు. కొత్తగా చికెన్ షాప్ పెట్టాలనుకునే వారు ఆ ఏరియా యూనియన్ ని సంప్రదించి యూనియన్ నిబంధనలు పాటించాలని తెలిపారు.మరియు కంపెనీలకు రేటు మార్జిన్ ఇవ్వాలని కంపెనీలను కోరారు.కొన్ని ఏరియాలలో కంపెనీస్ యూనియన్ విరుద్ధంగా సొంత నిర్ణయాలతో వెళ్తున్నాయి.వారికి తెలంగాణ రాష్ట్ర చికెన్ సెంటర్ అసోసియేషన్ నుండి చర్యలు తప్పవని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలు యూనియన్ లీడర్లు పాల్గొని యూనియన్ అసోసియేషన్ ని బలపరిచారు.అనంతరం సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ తప్పకుండా మీ యొక్క డిమాండ్లకు తన యొక్క మద్దతు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వేశ్వర్ రావు,యూనియన్ఎల్బీనగర్ అధ్యక్షుడు నెల్లుట్లశేఖర్,ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్,జనరల్ సెక్రెటరీ రాఘవేందర్,జాయింట్ సెక్రెటరీ ఖాజావలి,కోశాధికారి ఆవుల నాగరాజు,సోషల్ మీడియా నితిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ - అమ్మ హెల్పింగ్ హ్యాండ్ సంస్థల అన్నదానం



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్): ఫిబ్రవరి 23,**
ఆకలితో ఉన్న పేదలకు, ఆసుపత్రుల్లో రోగుల సహాయకులకు అండగా నిలిచేందుకు 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ మరోసారి తన ఉదారతను చాటుకుంది. హైదరాబాద్‌లోని నిలోఫర్,ఎం ఎన్ జె క్యాన్సర్ ఆసుపత్రుల వద్ద అమ్మ హెల్పింగ్ హ్యాండ్ సంస్థతో కలిసి ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.
'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఆసుపత్రులకు వచ్చిన సుమారు 300 మందికి పైగా పేదలకు,రోగుల సహాయకులకు పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించారు. దూరప్రాంతాల నుండి చికిత్స కోసం వచ్చి, ఆకలితో అల్లాడుతున్న వారికి ఈ కార్యక్రమం ఎంతో ఊరటనిచ్చింది. ఈ సందర్భంగా 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ, ప్రతి వారం క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆకలి లేని సమాజమే మా లక్ష్యం అని అన్నారు. ఈ సత్కార్యంలో భాగస్వాములు కావాలనుకునే దాతలు, వాలంటీర్లు ముందుకు రావాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రకాష్ యాదవ్,బిటి నాయుడు,సినీ నటుడు విజయ్ భాస్కర్, పురుషోత్తం, ప్రశాంత్, బాలకృష్ణ,సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల్లోకి రాజు నాయక్..

### 6వ వార్డులోని బాబా నగర్ లో పార్కులో పారిశుద్ధ్య పనులు



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
వార్డు అభివృద్ధి విషయంలో నిరంతరం ప్రజల వెంట ఉంటామని 6వ వార్డు కౌన్సిలర్ రాజు నాయక్ అన్నారు. పార్కుకు ప్రగతి వెలుగులు తేవడంలో భాగంగా సోమవారం స్థానిక బాబా నగర్ కాలనీలోని పార్కులో పారిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించారు. పార్కును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అదేవిధంగా వార్డులోలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. ప్రజలకు మౌలిక సదుపాయాల విషయంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ సహకారంతో కాలనీలలో పూర్తి అభివృద్ధి చేపడుతానని తెలిపారు.

## ఎన్నా చెరువు కంచె నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** స్థానిక కాలనీవాసులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేలా చెరువును సుందరీకరించాలని అధికారులకు ఆదేశం. 132 జీడిమెట్ల డివిజన్ "ఎన్నా చెరువు" కంచే నిర్మాణ పనులను బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిశీలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ, చెరువు పైవున్న రోడ్డును స్థానిక కాలనీ వాసులకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేసి,రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చి కంచె నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. చెరువులో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు కలవకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చర్యలను చేపట్టి ఎన్నా చెరువులో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసే విధంగా చెరువును సుందరీకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ,డిఈ వీరారెడ్డి,ఏఈఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
సోమవారం ప్రజావాణి సందర్భంగా సిపిఐ నాయకులు ఐడిపిఎల్ లోని వాటర్ వర్క్స్ కార్యాలయంలో నీటి సమస్యపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ మండలం పరిధిలో మంచి నీటి సరఫరా గతంలో నిర్దిష్ట సమయంలో సరఫరా జరిగేదని కానీ గత కొన్ని వారాలుగా సమయపాలన పాటించకుండా ఇష్ట రితిన విడుదల చేస్తున్నారని దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అదే విధంగా గతంలో గంటన్నర,రెండు గంటలు నీటిని సరఫరా చేస్తే నేడు కేవలం అర్ధగంట మాత్రమే విడుదల చేస్తున్నారాని దీని వల్ల ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులకు గురవుతున్నారని కావున వెంటనే పైన పేర్కొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. జనరల్ మేనేజర్ మాధవి వచ్చే వారం లోపు సమస్యను పరిష్కరిస్తానని అన్నారు లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని సిపిఐ నాయకులు అధికారికి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,మండలం కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి రాములు,శాఖకార్యదర్శిసహదేవరెడ్డి, వెంకటేష్,ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు,మాజీ కౌన్సిలర్ నర్సయ్య,సిపిఐనాయకులుమల్లేష్,యాదయ్య,బాబు,శ్రీను,ఇమామ్,రాజేశ్వర్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు..

- పల్లె ప్రగతికి ప్రాణం పోస్తా: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..
- సీసీ రోడ్లకు మోక్షం.. భారీగా భవనాల నిర్మాణం..
- గ్రామాలను కలిపే వంతెనలకు మరమ్మతులు..
- రూ.10 కోట్లతో వివిధ గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు..
- మీడియా సమావేశంలో ప్రకటించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- మున్సిపాలిటీ విజయంపై సంతోషం
- సహకరించిన ఓటర్లకు ప్రజలకు కార్యకర్తలకు నాయకులకు మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన కొత్త సర్పంచ్ లకు సరికొత్త కానుకగా గ్రామీణ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న సమస్యలను తీర్చే విధంగా ఈ నిధులు మంజూరు అయ్యాయని వెల్లడించారు. పలు గ్రామాలలో తాగునీటి సమస్యలు, పాఠశాలల మరమ్మత్తులు, కాలువల నిర్మాణం,సీసీ రోడ్ల నిర్మాణం, వంతెనల మరమ్మత్తులు, ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు వంటి కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాలలో కలిపి మొత్తం రూ. 10 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోయినప్పటికీ ప్రభుత్వం భారీ ఎత్తున నిధులు మంజూరు చేసి గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో కూడా ఓటర్లు దీవించి తమకు అవకాశాన్ని ఇచ్చారని,త్వరలో వార్డులవారీగా అభివృద్ధి చేపడుతానని వెల్లడించారు. అభివృద్ధి విషయంలో పార్టీల తేడాను చూడనని, బిజెపి కౌన్సిలర్ ప్యాట అశోక్ అడిగిన వెంటనే వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు అంగీకరించానని స్పష్టం చేశారు. ప్రజల తీర్పును తాము ఎప్పుడూ గౌరవిస్తామని,వారి నిర్ణయం మేరకే ముందుకు నడుస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికలతో పాటు మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ వైపు ఓటర్లు నిలబడి ప్రజల భారీ మద్దతుతో కార్యకర్తలు నాయకులు పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేసి విజయం సాధించాలని అదేవిధంగా మీడియా సహకారం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు సంతోషం వ్యక్తం చేశారు.

**ప్రగతి వెలుగులు ఇలా..**
ఫరూక్ నగర్ మండలంలో పంచాయతీరాజ్ భవనానికి 25 లక్షలు,సీఎస్కే లో ఏడు సీసీ రోడ్ల నిర్మాణానికి 14 లక్షలు,కొత్తూరు మండలంలో ఇనుముల నర్వ, జేపీ దర్గా మధ్య సిసి రోడ్డు నిర్మాణానికి రెండు లక్షలు, పంచాయతీరాజ్ భవనానికి 25 లక్షలు, ఇనుములనర్వలో ఆరు సిసి రోడ్లకు 12 లక్షలు, కొందుర్గు మండలంలో పిడబ్ల్యుడి రోడ్డు నుంచి రేగడి చిలకమర్రి వరకు రహదారి నిమిత్తం 45 లక్షలు, తంగేళ్లపల్లి నుంచి విశ్వనాధ్పూర్ మీదుగా చిలకమర్రి కి వీటి రోడ్డు నిమిత్తం 2.20 కోట్లు, రేగడి చిలకమర్రి పరిధిలో రెండు రహదారుల నిమిత్తం కోటి రూపాయలు, నందిగామ మండలంలో అంతేనా మరమ్మత్తులు నిమిత్తం 45 లక్షలు,వీర్లపల్లి గ్రామంలో కమ్యూనిటీ భవనం నిమిత్తం 1.15 కోట్లు, వీర్లపల్లి నుంచి పెట్టి ల్యామినేషన్ వరకు రహదారి నిమిత్తం 3.50 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా రూ.10 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు.

## షాద్ నగర్ వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఘన సన్మానం..

### వీరశైవ కౌన్సిలర్లు విశాలా విశ్వం, కొప్పునూరి ప్రవీణ్ దంపతులకు సత్కారం..







**ప్రజావినికిడి,(షాద్ నగర్**
సమాజాభివృద్ధిలో వీరశైవుల పాత్ర అనిర్వచనీయమని మంచివైపు నిలిచి ప్రజలను మార్గ నిర్దేశకులుగా చేస్తూ సమాజాన్ని చైతన్య పరిచే గొప్ప పాత్ర వీరశైవులదని షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ (బస్వమప్ప) అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో వీరశైవ సమాజం భవనంలో షాద్ నగర్ అధ్యక్షుడు బొబ్బిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వశీ, కౌన్సిలర్ అగ్గనూర్ విశాల విశ్వం, కొప్పునూరి ప్రవీణ్ దంపతులకు వీరశైవ సమాజం ఆధ్వర్యంలో సన్మానం కార్యక్రమాన్నీనిర్వహించారు.
ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బస్వం మాట్లాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాలలో వీరశైవులది అంతులేని పాత్ర అని అన్నారు. షాద్ నగర్ లో అధ్యక్షుడు బొబ్బిలి ప్రవీణ్ నేతృత్వంలో వీరశైవ సోదరులు అనేక సేవా కార్యక్రమాలు ముందుకు నడిపిస్తున్నారని ఇది ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ప్రస్తుతం వేరే శైవులు చేసే సంక్షేమ అభివృద్ధి తదితర సామాజిక కార్యక్రమాలలో మున్సిపల్ తరఫున తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. వీరశైవులకు ముగ్గురికి ఈ పట్టణంలో కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి అద్భుతమని పేర్కొన్నారు.
అదేవిధంగా మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం,కౌన్సిలర్ విశాల,మరో కౌన్సిలర్ కొప్పునూరు ప్రవీణ్ లు మాట్లాడుతూ,ఈ అవకాశం కల్పించిన వీరశైవ సమాజానికి అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర నేతలకు కార్యకర్తలకు అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వీరశైవ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు. స్థానిక విరసేవ సమాజ అధ్యక్షుడు బొబ్బిలి ప్రవీణ్ మాట్లాడుతూ, పట్టణంలో వీరశైవులు విజయదుందుభి మోగించారని ఎవరు ఊహించిన విధంగా మూడు స్థానాలను ఎక్కడా ఓడిపోకుండా గెలిపించుకుందామని వారు పేర్కొన్నారు. అంది వచ్చిన అవకాశం గా అగనూరు బసవేశ్వర్ కు చైర్మన్ పీఠం లభించడం ఎంతో సంతోషంగా ఉందని ఇది వీరశైవుల విజయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,మహిళ అధ్యక్షురాలు పట్వారీ వినిత ,శ్రవణ్ కుమార్,సుంకు మల్లేష్,సుంకు స్వరం,ఫణి కుమార్,శివ కుమార్,సంతోష్ , శేఖరప్ప, బస్వరాజ్,లింగం, ఉల్లి శరణయ్య, అభిలాష్,శివ కుమార్,సుంకు కేదర్ నాద్,సుంకు విశ్వం,వీరశం, రేటికల్ రేణుకాంత్,బీసీ జనసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖరప్ప, మల్లి కార్జున్ ,అగ్గనూర్ నందు,రవితేజ, కడియల సాయి కుమార్,రాజేష్, శివ,మల్లికార్జున్, మహిళలు శర్వాణి,మాధవి, పొగాకు శైలజ, మౌనిక,జగదేవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధమిక పాఠశాలల కాంప్లెక్స్ సమవేశం





**ప్రజావినికిడి,(వాజేడు):ఫిబ్రవరి 23**,వాజేడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాజేడు నాగారం నందు వాజేడు నాగారం ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశం జరిగింది.
ఈ సమావేశాన్ని మండల విద్యాశాఖాధికారి తేజావత్ వెంకటేశ్వరరావు, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు సోయం ఆనందరావు ప్రారంభించారు.
ఈ సమావేశంలో ఫౌండేషనల్ లిటరసి అండ్ న్యూమరసి ఫౌండేషన్ లిటరసీ స్టడీ అనే అంశాలపై ఉపాధ్యాయులు చర్చించారు. రెండవ తరగతి మూడవ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రాథమిక అక్షరాస్యత చదవడం రాయడం గణిత సంఖ్యా జ్ఞానం మొదలగు విషయాలపై చర్చించారు. ఈ సమావేశాన్ని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ క్వాలిటీ కో - ఆర్డినేటర్ -1 బి.శ్యామ్ సుందర్ రెడ్డి క్వాలిటీ కో ఆర్డినేటర్ - 4 గుళ్ల పెల్లి సాంబయ్య, ఉల్లాస్ కో-ఆర్డినేటర్ పీర్ల కృష్ణబాబులు పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఆంగ్ల భాషలో ఉచ్చారణ, రాత నైపుణ్యాలను పెంపొందించుటకు ఉపాధ్యాయులు ప్రాథమిక స్థాయి నుండే కృషి చేయాలని అన్నారు. వాజేడు మండల విద్యాశాఖ అధికారి తేజావత్ వెంకటేశ్వరరావు విద్యా పర్యవేక్షణ మండల ఉపాధ్యాయుల హాజరు శాతం, పని తీరు ఉత్తమ స్థాయిలో ఉందని ప్రశంసించారు. ఈ సమావేశంలో రిసోర్సు పర్సన్స్ బోదేబోయిన జయేందర్ , సయ్యద్ అలీముద్దీన్ ఖాద్రి,సీఆర్పీ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్ కార్డుల వ్యవహారాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. - అర్హత గల జర్నలిస్టులందరికీ "అక్రిడేషన్లు" ఇవ్వాలనీ షాద్ నగర్ టిడబ్ల్యుజేఎఫ్ కమిటీ వినతి..**

**పాత పద్ధతుల్లోనే కార్డులు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.డి ఖాజాపాషా వినతి..**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):** ప్రతినిత్యం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్న బాధ్యతగల జర్నలిస్టులకు అర్హులైన వారందరికీ అక్రిడేషన్ ప్రభుత్వ కార్డులు అందుతాయని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ భరోసా ఇచ్చారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) డివిజన్ అధ్యక్షుడు జే. రాఘవేందర్ గౌడ్, జిల్లా ప్రచార కమిటీ సభ్యులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు జర్నలిస్టుల అక్రిడేషన్ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి ఖాజాపాషా (కేపీ), సీనియర్ జర్నలిస్టు కస్తూరి రంగనాథ్, రాకేష్,సాయి రెడ్డి, బూరుగుల రమేష్, మల్చలం రమేష్, షకీల్,రియాజ్, జగన్,విష్ణు, రవితేజ,రాకేష్, శివ,ఆవుల రమేష్, సమీ,నరేందర్, భాస్కర్,శ్రావణ్ గౌడ్ తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ వినతిపత్రం స్వీకరించి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను అర్థం చేసుకొని వారికి తగిన విధంగా గౌరవ మర్యాదలతో వారికి కావలసిన రీతిలో నూతన నిబంధనలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో మాదిరిగా విచ్చలవిడిగా ఎవరికి పడితే వారికి అర్హత లేని వారికి ఎంతో మందికి కార్డులు మంజూరయ్యాయని జర్నలిస్ట్ సంఘాలు ప్రభుత్వం తీసుకువచ్చాయన్న విషయాన్ని వివరించారు. ఇలాంటి సమయంలో ప్రక్షాళన చేపట్టి జర్నలిస్ట్ సంఘాల అనుమతి వారి సూచన సలహాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. నూతన నిబంధనల వల్ల ఏవైనా లోటుపాట్లు ఉంటే వాటిని సవరించి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందే విధంగా కృషి చేస్తామని ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి ఖాజాపాషా కేపి, డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి తమ సమస్యల తో కూడిన వినతి పత్రాన్ని అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ కార్డులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులో సంబంధించిన అక్కడ వ్యవహారంలో ఎలాంటి వివాదాలు లేకుండా ఆయా సంఘాలతో మాట్లాడి మీడియా అకాడమీతో చర్చించి అందరికీ అర్హులైన వారికి కార్డులు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అనేక సందర్భాల్లో ముఖ్యమతి రేవంత్ రెడ్డి మీడియా విలువల గురించి ప్రస్తావించారని వాటిని అన్ని సంఘాలు ఆహ్వానించాయని తప్పకుండా విలువలతో కూడిన ప్రయత్నం చేసి అర్హులైన జర్నలిస్టులకు కార్డులు అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. అక్రిడేషన్ కార్డులలో నియోజకవర్గ స్థాయిలో కోత విధించకుండా హెడ్ క్వార్టర్ల పేర్లు వచ్చే విధంగా కార్డులు ఉండాలని కేవలం మండలాలను పేరు పెట్టడం ఒకటే సరికాదని నియోజకవర్గస్థాయిలో ఉన్న పేర్లను కూడా పట్టణ రూరల్ స్థాయి విలేకరులకు కూడా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.




# సీనియర్ సిటిజన్స్ సేవాసమితి పదవ వార్షికోత్సవం కార్యక్రమంలో

**పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి**





**ప్రజావినికిడి,(కొత్తపేట):ఫిబ్రవరి 23,** చైతన్యపురి డివిజన్ పరిధిలోని ద్వారకాపురం సీనియర్ సిటిజన్స్ సేవాసమితి వారి పదవ వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చైతన్యపురి డివిజన్ భారస పార్టీ యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్ల సంక్షేమం,భద్రత మరియు ఆర్థిక స్వాతంత్ర్యం కోసం ప్రభుత్వం,స్వచ్ఛంద సంస్థలు వివిధ సేవలను,పథకాలను అందిస్తున్నాయి అని అన్నారు. 60 ఏళ్లు పైబడిన వారికి ఆరోగ్య పరీక్షలు,పెన్షన్లు,రైల్వే/బస్సు రాయితీలు అలాగే 65+ వయస్సు వారికి ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి సీఐ సైదులు,ద్వారకాపురం సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు ప్రసాద్, రాఘవ రెడ్డి,పానకాల రావు,లక్ష్మీ నారాయణ,సురేష్ నాయుడు,శ్రవణ్, విశ్వనాథ్, శ్రీనివాస్,కేఎస్ శాస్త్రి,రంగాచారి,సుబ్బారావు తదితరులు పాల్గొనడం జరిగింది.

# పంట నమోదు పకడ్బందీగా నిర్వహించండి.

**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** నియోజకవర్గంలో పంట నమోదు,ఫార్మర్ రిజిస్ట్రేషన్ పకడ్బందీగా నిర్వహించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,
రాష్ట్ర ప్రభుత్వం,వ్యవసాయ శాఖ ఆదేశానుసారం వ్యవసాయ విస్తరణ అధికారులు వాలంటీర్ ల సహాయంతో గ్రామాల్లోకి వెళ్లి పంటల నమోదు చేయాలని కోరారు. అదేవిధంగా రైతు నమోదు (ఫార్మర్ రిజిస్ట్రేషన్) వేగవంతం చేయాలని తెలిపారు. ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ తో రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు. అలాగే యూరియా కొరత లేకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ అదనపు సంచాలకులు రమాదేవి, వ్యవసాయ విస్తరణ అధికారులు,మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాధవరం ఆరోపణలను

# ఖండించిన హైడ్రా

**సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులు మారబోవని చెప్పిన హైడ్రా**

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణల్లో నిజం లేదని స్పష్టీకరణ**

**2014లో నిర్ధారించిన హద్దుల ప్రకారమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి**

**ఆక్రమణలకు గురైన చెరువును 31 ఎకరాలకు విస్తరించామని వెల్లడి**

**పేదలకు అన్యాయం, పెద్దలకు రక్షణ కల్పించే ఉద్దేశం లేదని స్పష్టత**





హైదరాబాద్,**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**
మాదాపూర్‌లోని సున్నం చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) సరిహద్దుల్లో ఎలాంటి మార్పులు చేయడం లేదని హైడ్రా స్పష్టం చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చి అభివృద్ధి పనులు చేపడుతున్నారంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. చెరువు అభివృద్ధి పనులను అత్యంత శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపడుతున్నామని, ఇందులో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని ఒక ప్రకటనలో పేర్కొంది. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌ను 2014 మే నెలలోనే నిర్ధారించారని, ఆ సరిహద్దుల మేరకే ప్రస్తుతం పనులు చేపడుతున్నామని హైడ్రా వివరించింది. ఈ పనుల్లో పేదలకు అన్యాయం చేయడం గానీ, పెద్దలను కాపాడటం గానీ జరగడం లేదని తేల్చిచెప్పింది. ఒకప్పుడు ఆక్రమణలకు గురై కేవలం 14 ఎకరాలకు కుచించుకుపోయిన ఈ చెరువును, 2014లో ఇరిగేషన్ శాఖ నిర్ధారణ ప్రకారం 31 ఎకరాలకు విస్తరించిన విషయాన్ని గుర్తుచేసింది. ఇరిగేషన్, రెవెన్యూ వంటి సంబంధిత శాఖల సమన్వయంతోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని తెలిపింది. సోమవారం సున్నం చెరువును సందర్శించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు, అక్కడే ఉన్న ఇరిగేషన్ అధికారులు వాస్తవాలను వివరించారని హైడ్రా పేర్కొంది. 2014లో ఇరిగేషన్ శాఖ నిర్ణయించిన జియో కో-ఆర్డినేట్స్ (అక్షాంశాలు, రేఖాంశాలు) ప్రకారమే ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్పష్టం చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులు శాశ్వతమైనవని, వాటిని మార్చే ప్రసక్తే లేదని హైడ్రా తన ప్రకటనలో పునరుద్ఘాటించింది. ఈ విషయంలో అనవసర అపోహలు సృష్టించవద్దని కోరింది. చెరువు అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రకటించాలి !





**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**
మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. అడపాదడపా గంజాయిని, ఇతర మత్తు పదార్థాలను పట్టుకుంటున్నా..అదేమంత పెద్ద మొత్తంలో కాదని తెలుస్తోంది. చాపకింద నీరులా ఈ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా విస్తరిస్తోంది. రోజూ ఎక్కడోచోట దాడుల్లో మత్తు పదార్థాలను పట్టుకుంటూనే ఉన్నారు. అయినా రవాణా ఆగడం లేదు. దొరికిన వారిని ఎన్‌కౌంటర్ చేస్తే తప్ప రవాణా ఆగదేమో అన్న ఆందోళన కలుగుతోంది. నిరుద్యోగులు దీనిని ఓ ఉపాధిగా ఎంచుకోవడం వల్లనే రవాణా సులభంగా మారింది. దీనికితోడు దీంతో డబ్బులు కూడా బాగా రావడంతో యువత దీనిని ఉపాధిగా ఎంచుకుని ఈ ఉచ్చులో దిగుతున్నారు. దీనికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్టాల్సి ఉంది. యువత పెడమార్గం పట్టకుండా వారికి ఉపాధి చూపాలి. స్కూలుస్థాయిలోనే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. కాలేజీల్లో నిఘా పెంచాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా పరిస్థితికి అడ్డుకట్ట పడడం లేదు. ముఖ్యంగా యువత మత్తుకు అలవాటు పడి దుర్మర్గాలకు దిగుతున్నారు. మత్తు మనిషిలోని విచక్షణను హరించి వేస్తోంది. ఎలాంటి దారుణాలకు దారి తీస్తుందో చెప్పటానికి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఇటీవల జరిగిన బాలిక హత్యాచార దుర్మార్గం ఓ హెచ్చరిక కావాలి. ఇదొక్కటే కాదు ఇలాంటి ఘటనలు చాలానే జరుగుతున్నాయి. మత్తులో ఓ మైనార్ బాలికను కొందరు సామూహిక అత్యాచచరం చేసారు. అభంశుభం తెలియని పసిపాపను చిదిమేసిన ఘటనలో కులవర్ధన్ అనే దుర్మార్గుడు ఆత్మహత్ చేసుకున్నా సంతోషించడానికి లేదు. నెల్లూరు నగరంలో పట్టపగలే అందరూ చూస్తుండగానే- పెంచలయ్య అనే ప్రజాకళాకారుడిని గంజాయి మూక పొట్టన పెట్టుకొంది. నిజామాబాద్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్ సౌమ్యను ఈ ఏడాది జనవరిలో మత్తు మాఫియా కారుతో గుద్ది, ప్రాణాలు బలిగొంది. గంజాయికి అలవాటు పడ్డ ముఠాలు హత్యలకు, అత్యాచారాలకు పాల్పడుతున్న దారుణ ఉదంతాలు తరచూ చూస్తూనే ఉన్నాం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అంటకాగుతూ ఈ ముఠాలు తమ దౌర్జన్యాలను చెలాయిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. పైపై చర్యలతో ఈ గంజాయి సామ్రాజ్యం నశించిపోదని గ్రహించాలి. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఒక ఖచ్చితమైన కార్యాచరణ రూపొందించాలి. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలతో సంబంధం ఉన్న ముఠాలను పార్టీల నుంచి వెలివేయాలి. రాజకీయ దన్నుతో విర్రవీగుతున్న గంజాయి సామ్రాజ్యాన్ని సామాజికంగా, రాజకీయంగా అన్ని విధాలా ఒంటరిపాటు చేసినప్పుడే ? దాని నియంత్రణ, నిర్మూలన సాధ్యమవుతుంది. ఈ ఘటన యువతలో మార్పు తీసుకుని వస్తుందని అనుకోవడం భ్రమే అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాదక ద్రవ్యాల విచ్చలవిడి వినియోగం ఆందోళన కలిగించేలా ఉంది. దాని నియంత్రణకు,నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా లాభం లేకుండా పోతోంది. ఉభయ తెలుగు రాస్ట్రాల్లో వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వరుసపెట్టి ఈ తరహా దారుణాలు జరుగుతున్నందుకు కఠిన చర్యలు తీసుకోకపోవటం క్షంతవ్యం కాదు. వరుసగా జరుగుతున్న చాలా నేరాల వెనుక మత్తు, మాదకద్రవ్యాలు విపరీతంగా పనిచేస్తున్నాయని ప్రభుత్వాలు గుర్తించాలి. నిందితుల ప్రాణాలు తీసేస్తానో, జైల్లో వేస్తోనే, లేదా వారే తీసుకుంటేనో ఈ సమస్యకు పరిష్కారం దక్కదు. విస్తరిస్తున్న మాదక ద్రవ్యాల రవాణాను సవాల్‌గా తీసుకోవాలి. కూకటివేళ్లతో సహా పెకలించాలి. దానికి నిరంతరమైన, నిర్దిష్టమైన కార్యాచరణతో ప్రభుత్వాలు నిచేయాలి. అవసరమైతే ఉభయ తెలుగు రాష్ట్రాలు కలిసి పనిచేయాలి. ఇటీవల కాలంలో రాష్ట్రంలోనూ, దేశంలోనూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. పన్నెండేళ్ల వయసు పిల్లలు మొదలుకొని యువకుల వరకూ ఎక్కువగా వినియోగిస్తున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందమైన భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన విద్యార్థులు మత్తుకు బానిసలై జీవితాలను వ్యర్థం చేసుకుంటున్న ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయి. మత్తు బానిసలను ఆ ఊబి నుంచి బయటకు తెచ్చే వైద్యానికే దేశంలో ఏటా రూ.15 వేల కోట్ల ఖర్చువుతుందని ఒక అంచనా. చికిత్సకు వెళ్లకుండానే కొందరు మత్తులనే కుప్పకూలి పోతున్నవారు దేశంలో 2003 - 2013 మధ్య పోలీసు తనిఖీల్లో రూ.40 వేల కోట్ల విలువైన 26 లక్షల కేజీల మాదకద్రవ్యాలు పట్టుబడితే- తరువాతి పదేళ్ల కాలంలో అంటే 2014 - 2025 మధ్య కాలంలో రూ.1.65 లక్షల కోట్ల విలువైన కోటి కిలోల మాదకద్రవ్యాలు దొరికాయి. విచ్చలవిడిగా పెరుగుతున్న మత్తు ద్రవ్యాల వినియోగానికి ఈ గణాంకాలు ఒక ఉదాహరణ. దొరికిన మాదకద్రవ్యాలే ఇంత పెద్దఎత్తున ఉంటే దేశమంతా విస్తరించి వినియోగమైనది ఎంత ఉంటుందో ఊహించవొచ్చు! మాదకద్రవ్య వినియోగం తొలుత సరదాగా మొదలై, ఉత్తేజం ఇస్తున్నట్టుగా అనిపించి, తరువాత మనిషి సర్వ శారీరక వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తుంది. మత్తుకు బానిసయ్యేలా మార్చేసి, విచక్షణను, వివేచనను చంపేస్తుంది. సామాజిక కట్టుబాట్లను, నాగరిక విలువలను కాలదన్ని, మనిషిని మృగంలా మార్చేస్తుంది. ఫలితంగా తీవ్రమైన నేరాలూ, దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. మాదకద్రవ్యాల కారణంగా ఎన్నో కుటుంబాలు అస్తవ్యస్త మవుతున్నాయి. ముఖ్యంగా నైజీరియాన్స్ వీసా గడవువ ముగిసినా ఇక్కడే తిష్టవేసి మత్తు వ్యాపారం చేస్తున్నారు. వీరిని ముందుగా గుర్తించాలి. మత్తు పదార్థాల రవాణను అరికట్టేందుకు ఆపరేషన్ చేపట్టాల్సిందే. ఇందుకోసం పెద్ద ఎత్తున బలగాలను వినియోగించాలి. యువతను కాపాడుకోవడానికి ఎంత కఠినమైన చర్యలకైనా వెనకాడరాదు.

# తిరుమలలో నాకాబంది

## విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు -ఆరు ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో సోదాలు


తిరుమల,**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**
తిరుమలలో యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. తిరుమల డీఎస్పీ పర్యవేక్షణలో బాలాజీ నగర్ ప్రాంతంలో విస్తృత స్థాయి నాఖాబందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖతో పాటు టీటీడీ విజిలెన్స్, ఏపీ ఫారెస్ట్, టీటీడీ ఫారెస్ట్, ఫైర్ శాఖ, టీటీడీ రెవెన్యూ, రెవెన్యూ శాఖ, బిడి టీమ్స్, ఎక్సైజ్ శాఖ, హెల్త్ శాఖలకు చెందిన సుమారు 90 మంది సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 6 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో బాలాజీ నగర్ ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా టీటీడీ కేటాయించిన నివాసాల్లో అనుమతిపొందిన వ్యక్తులే ఉంటున్నారా లేదా కొత్త



వ్యక్తులు అనుమానాస్పదంగా నివసిస్తున్నారా అనే కోణంలో పరిశీలన చేపట్టబడింది. ప్రతి విభాగం వారు తమ తమ శాఖలకు సంబంధించిన అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ నాఖాబందీ కార్యక్రమంలో మొత్తం 820 ఇళ్లను తనిఖీ చేయగా, సరైన గుర్తింపు కార్డులు లేని 16 మంది అనుమానితులను అదుపులోకి తీసుకు న్నారు. అలాగే గుర్తింపు పత్రాలు లేని 11 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు స్థానికులతో సమావేశమై, తమ ఇళ్లను అపరిచిత వ్యక్తులకు బాడుగకు ఇవ్వవద్దని, సరైన గుర్తింపు లేకుండా ఎవరినీ పనులకు నియమించవద్దని సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే విధంగా ఎవరూ ప్రవర్తించరాదని స్పష్టం చేశారు. స్థానిక నివాసులు ఈ నాఖాబందీ కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహకారం అందించగా, తిరుమలలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురలీకృష్ణ, ఆదేశాల మేరకు, తిరుమల అదనపు ఎస్పీ సూచనలతో ఈ తనిఖీలు చేపట్టారు.

# కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

## ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం



శ్రీనగర్,**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,:**
జమ్మూకశ్మీర్ లోని కిస్ట్‌వార్ జిల్లా లో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ కోసం పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న కచ్చితమైన సమాచారం అందుకున్న భద్రతాబలగాలు.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆ స్థావరాన్ని చుట్టుముట్టాయి. భద్రతాబలగాలు లొంగిపోవాలని హెచ్చరించగా.. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాంతో భద్రతాబలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఆ ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైఫుల్లా కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

# వైభవంగా సాగుతున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు

## గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నారసింహుడు



యాదగిరిగుట్ట,**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం యాదగిరీశుడిని 'గోవర్ధనగిరిధారి' అలంకరణలో భక్తులు సేవించారు. భక్తజన రక్షణెళి ధ్యేయంగా అవతారాలు దాల్చిన స్వామివారు ప్రకృతి బీభత్సం నుంచి కాపాడే భక్తజన బాంధవుడిగా శ్రీకృష్ణుడి లీలలను ప్రతిబింభించే అలంకరణలో దివ్య మనోహరంగా భక్తజనులకు దర్శనమిచ్చారు. తన చిటికెన వేలుతో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిపట్టి గోపాలులను రక్షించిన మహిమలను అర్చకులు అలంకార విశిష్టతను భక్తులకు వివరించారు.భక్తుల గోవిందనామ స్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు. ఉత్సవాలను ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు, అర్చక బృందం, వేదపడింతులు, రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు సింహ వాహనం పై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో దోర్భల భాస్కరశర్మ, ఏఈవోలు, పర్యవేక్షకులు, ఉద్యోగ, సిబ్బంది, భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

# ఏపిలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

## పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు -గంటముందే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు

అమరావతి,**ఫిబ్రవరి 23 ప్రజావినికిడి,**
రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9:00 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా పరీక్ష ప్రారంభ సమయం కంటే దాదాపు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 10,57,899 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 5,31,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. రేపటి నుంచి అంటే మంగళవారం నుంచి మొదలయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,26,264 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం1,537 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సహా ఎలాంటి గాడ్జెట్‌లకు అనుమతి లేదని ఇప్పటికే విద్యార్థులకు బోర్డు స్పష్టం చేసింది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. అలాగే ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మార్చి 24వ తేదీ వరకు పరీక్షలు



జరగనున్నాయి. విద్యా సంవత్సరంలో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో మొదటి సంవత్సరం గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్, హిస్టరీ స్జబెక్టులకు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. మిగిలిన, బ్యాక్‌లాగ్ స్జబెక్టులకు, రెండో సంవత్సరం అన్ని స్జబెక్టులకూ 24 పేజీల బుక్‌లెట్‌ను అందజేయనున్నారు. ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. అదనపు జవాబు పత్రాలు ఇవ్వరు.విద్యార్దులను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకెళ్లకుండా పరిశీలించి లోపలికి అనుమతించారు. బాలురు కు పురుషులు, బాలికలకు మహిళా సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. మొదటి పరీక్ష కావడంతో విద్యార్దులు వెంట తల్లి తండ్రులు వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లారు..విద్యార్దులు ఉత్సాహంగా ఒకరిని ఒకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ లోపలికి వెళ్ళారు. ఉదయం చేరుకున్న విద్యార్థులు వారి యొక్క హాల్ టికెట్స్ నెంబర్ల సరి చూసుకొని పరీక్ష కేంద్రం లోపలికి వెళ్ళారు.


# పెళ్లికోసం ఉదయ్‌పూర్‌కు



టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ- రష్మిక మందన్నా పేర్లు గత కొద్ది రోజులుగా నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందని ప్రచారం జరుగుతున్న వేళ ఎట్టకేలకు వధూవరులుగా పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ప్రేమ, పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన తరువాత పెళ్లి వేడుకల సందడి మొదలైంది. ఈ నెల 26న వివాహం జరగనుండగా, వేడుక కోసం ఈ జంట రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు బయల్దేరింది. ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన వీరి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ వెంట ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ ఉన్నారు. ఇప్పటికే ఉదయపూర్ ప్యాలెస్‌లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా వీరి ప్రేమ, పెళ్లిపై వార్తలు జోరందుకున్నాయి. సోషల్ మీడియాలో ఒకే పోస్ట్‌తో పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అభిమానులు ప్రేమగా పిలిచే 'విరోష్' పేరునే తమ వివాహానికి శీర్షికగా పెట్టామని పేర్కొన్నారు. మీరు ప్రేమగా పెట్టిన పేరు 'విరోష్'. మీ అందరి ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం. 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్" అంటూ ఎమోషనల్‌గా రాసుకొచ్చారు. ఉదయపూర్‌లో పెళ్లి అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ఓ లగ్జరీ హోటల్‌లో వేడుకకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. టాలీవుడ్ టాప్ సెలబ్రిటీలు, పలువురు రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని సమాచారం. లఅభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ కలల కపుల్ పెళ్లి వేడుక సోషల్ మీడియాలో మరింత సందడి చేయనుంది.

----------------


# త్రివిక్రమ్-వెంకి కాంబోలో ఎకె 47




టాలీవుడ్‌లో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం ఎకె 47' విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటివరకు 40 శాతం షూటింగ్ పూర్తవగా వెంకీ టీం దుబాయ్‌కు వెళ్లనుందట. 10 రోజులపాటు దుబాయ్‌లో సాగనున్న షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట త్రివిక్రమ్ టీం. దుబాయ్‌లో వచ్చే సీన్లు సినిమాను ఎలివేట్ చేసేలా రిచ్‌గా ఉండబోతున్నాయని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీలో పాపులర్ తమిళ కమెడియన్ యోగిబాబు కూడా నటిస్తున్నట్టు తెలుస్తోండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే సినిమా షూటింగ్ జూన్ కల్లా పూర్తి కానుందని సమాచారం. ఇప్పటికే 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాలకు రైటర్ హీరో కాంబోగా కలిసి పనిచేసిన త్రివిక్రమ్-వెంకీ ఇప్పుడు డైరెక్టర్ హీరోగా మొదటిసారి చేతులు కలపడంతో సినిమాపై క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఇటీవల విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నాయి. ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తోపాటు క్రైం ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది.

# ది ప్యారడైజ్ ప్రోమో సాంగ్ విడుదల

నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీని మొదటి పాటను విడుదల చేసేందుకు





సిద్ధమయ్యారు. తాజాగా 'ఆయా షేర్' అనే సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. పూర్తి పాట ఫిబ్రవరి 24న రానుంది. అనిరుధ్ అందించిన సంగీతం జోష్ పెంచేలా కనిపిస్తోంది. ఇదిలావుంటే నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'ది ప్యారడైజ్'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

# ఉస్తాద్ భగత్ సింగ్ సెకండ్ సింగిల్ కు విశేష స్పందన

పవర్ స్టార్ పవన్ కల్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా నుంచి రెండో పాట విడుదలైంది. 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పేరుతో విడుదలైన ఈ పాట యూట్యూబ్‌లో విశేష స్పందనతో దూసుకెళ్తోంది. ముఖ్యంగా పవన్ అభిమానులను ఈ పాట ఉర్రూతలూగిస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

దేవి శ్రీ ప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ పవర్‌ఫుల్ సాహిత్యం అందించారు. 'నేను మెడ ముట్టుకుంటే, తొడ కొట్టినట్టే' అనే హుక్ లైన్‌తో మొదలయ్యే ఈ పాట, పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఉండటంతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో జరిగిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో అభిమానుల మధ్య ఈ పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ, పవన్ గత రెండు దశాబ్దాలుగా మెడ పట్టుకోవడం ఒక మేనరిజంగా చేస్తున్నారన్నారు. దానికి మాట రూపం ఇస్తే బాగుంటుందని 'నేను మెడ ముట్టుకుంటే, తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ రాశానని చెప్పారు. దాన్నే హుక్ లైన్‌గా తీసుకుని చంద్రబోస్ కేవలం 8 గంటల్లో అద్భుతమైన పాట రాశారని తెలిపారు. ఇది పవన్‌పై అవగాహనతో రాసిన పాట అని, దేవిశ్రీ పాటాభిషేకం చేస్తే, చంద్రబోస్ సిరాభిషేకం చేశారని ప్రశంసించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. చిత్రాన్ని ఈ ఏడాది మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పాటతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.




# నేను ఎక్కడ ఉంటే అదే నా ఇల్లు
## : శ్రుతి హాసన్

నటి, గాయని శ్రుతి హాసన్ 'ఇల్లు' అనే భావనపై తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇల్లు అంటే మ్యాప్‌లోని ఒక ప్రదేశం కాదని, అది ఒక లోతైన, వ్యక్తిగతమైన ఫీలింగ్ అని ఆమె అన్నారు. పలు భాషా చిత్ర పరిశ్రమల్లో పనిచేసిన అనుభవంతో, తనకు ఇల్లు అనే భావనపై అవగాహన పూర్తిగా మారిపోయిందని శ్రుతి తెలిపారు.

ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, "నాకు ఇల్లు అంటే అస్సలు భౌగోళిక ప్రదేశం కాదని గ్రహించాను. చెన్నైకి వెళ్లినప్పుడు నాకు అనంతమైన ప్రేమ, సౌకర్యం లభిస్తాయి. ముంబైలో మరో రకమైన ప్రేమను పొందుతాను. హైదరాబాద్‌లో పనిచేస్తున్నందున ఇక్కడ భిన్నమైన అనుబంధం ఉంటుంది" అని వివరించారు. ప్రతి నగరం తనకు ప్రత్యేకమైన అనుభూతిని పంచిందని ఆమె చెప్పారు. అయితే కాలక్రమేణా ఒక ముఖ్యమైన విషయాన్ని గ్రహించానని ఆమె తెలిపారు. "నన్ను ఎక్కడైనా వదిలేసినా, నేను సౌకర్యాన్ని వెతుక్కోగలను. ఒక ప్రదేశం, అక్కడి ప్రజలు, సంస్కృతి గురించి తెలుసుకుని, అందులో నాకు నచ్చిన దాన్ని నా సొంతం చేసుకుంటాను. నిజానికి నేను ఎక్కడ ఉంటే అదే నా ఇల్లు" అని శ్రుతి పేర్కొన్నారు. నాలో నాకు సౌకర్యంగా లేనప్పుడు, సొంత ఇంట్లో ఉన్నా సరే అసౌకర్యంగానే అనిపిస్తుందని అన్నారు. "నాకు నేనే ఇల్లు అనే భావన నా మెదడులో బలంగా నాటుకుపోయింది. జీవితంలో దేన్నైనా ఎదుర్కోవడానికి ఇది నాకు గొప్ప భద్రతను, భరోసాను ఇచ్చింది. ఈ ఆలోచన స్వార్థంగా అనిపించినా, నాకు బాగా పనిచేసింది. నాన్న (కమల్ హాసన్) తప్ప మరే వ్యక్తి నాకు ఇల్లులా సౌకర్యవంతంగా అనిపించలేదు" అని శ్రుతి స్పష్టం చేశారు.





# అల్లువారింట పెళ్లి సందడి
## పవన్, నాగబాబు దంపతులకు ఆహ్వానం

అల్లు వారింట పెళ్లి పనులు ఫుల్ జోష్‌లో జరుగుతున్నాయి. ఒకవైపు పసుపు దంచే కార్యక్రమాలు.. మరోవైపు బ్యాచిలర్ పార్టీలతో కొన్ని రోజుల నుంచి శిరీష్-నయనికల ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబును పెళ్లికి ఆహ్వానించారు. సతీ సమేతంగా పవన్ కల్యాణ్, నాగబాబుల ఇళ్లకు వెళ్లిన అల్లు అరవింద్.. వారికి నూతన వస్త్రాలు అందించి పెళ్లికి పిలిచారు. మార్చి 6న అల్లు శిరీష్ -నయనిక ఒకటి కానున్నారు. ఈ వేడుకకు ఇప్పటికే చిరంజీవికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఇటీవలే పసుపు దంచే కార్యక్రమం జరిగింది. ఆ ఫొటోలను అల్లు అర్జున్ సతీమణి స్నేహ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. హైదరాబాద్‌లోనే వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం. ఇక ఇటీవలే దుబాయ్‌లో ఫ్రెండ్స్ సర్కిల్‌కు బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613